# అరచేతిలో వైకుంఠం

**మా** క్లబ్బు కేవలం సంస్కృతిని పెంపొందించటానికి ఏర్పాటయినది కావటంచేత లోకాభిరామాయణం మాట్లాడుకునేటందుకెవరూ దొరికే వాళ్లుకారు. అందరూ చీట్లపేకలు మొదలైన సాంస్కృతిక వ్యాపకాల్లో నిమగ్నులై ఉండేవారు. పోగా సాంస్కృతిక వాసన బొత్తిగా లేని వాళ్లం మేం ముగ్గురం నలుగురం ఉండేవాళ్లం. మేమైనా కబుర్లుచెబితే వినేవాళ్లమేగాని చెప్పగల వాళ్లంకాం.

అందుచేత మాకు భగవాన్లుగారు దైవప్రసాదంలాగా దొరికాడన్నమాట. ఆయన విలువ కనిపెట్టటానికి మాకాటే కాలం పట్టలేదు. సీమచింతకాయలు మొదలుకొని సినిమాలదాకా ఆయన అనేక విషయాలను గురించి ధారాళంగా చెప్పేవాడు. పురాణయుగంలో సూతుడు మాట్లాడుతుంటే శౌనకాది మహామునులైతే యే విధంగా చెవులు రిక్కించి తన్మయులై వినేవారో భగవాన్లు చెప్పే కబుర్లు మేం అంత ఆసక్తితో వినేవాళ్లం. ఆయన కసలు మేం సూతుల వారని నామకరణం కూడా చేశాం.

ఒకనాటి గోష్ఠి సినిమాల మీదికి వెళ్ళింది.

"సుమారుగా ఉజ్జాయింపున ఒక మాదిరి పిక్చరు తీయాలంటే రమారమీ ఏపాటి పెట్టుబడి అవసరమౌతుందంటారు?" అని అడిగాడు మా సదస్యం. అతనికి మాటలు తూచి మాట్లాడ్డం అలవాటు. అంతేగాక అతను ఏ ప్రశ్నవేసినా అది తనకు అత్యంత ముఖ్యమైన సమస్య అనిపించేటట్టుగా తోపింపజేసేవాడు. నా మటుకు నేను సదస్యం వేసిన ఈ ప్రశ్నవిని, అతనే సుమారుగా ఉజ్జాయింపున ఒక మాదిరి పిక్చరు రమారమీ తీయబోతున్నాడనుకున్నాను.

ఆ ప్రశ్నకు మా సూతులవారు ఒక చిరునవ్వు నవ్వాడు. ఆయన తల అడ్డంగా ఆడించి "ఇప్పుడు కాలం మారిపోయింది" అన్నాడు.

నలుగురమూ ఆయనకేసి ప్రశ్నార్థకంగా చూశాం. సూతులవారు గొంతు సవరించుకున్నాడు, ఏదో కథ రాబోతుందని మాకర్థమయింది.

"వెనకటి రోజుల్లో– అంటే పదిహేనేళ్ళ క్రితం – నేనో మనిషిని చూశాను. ఆయన రెండు వందల రూపాయల పెట్టుబడితో ఒక పిక్చరు తీశాడు" అన్నాడు మా సూతులవారు.

"ఎట్లాగెట్లాగూ?"

"పిక్చరు పూర్తి అయిందా?"

"లాభం వచ్చిందాండీ?"

తొందరపడకుండా ఉంటే అన్ని ప్రశ్నలకూ సమాధానం వస్తుందన్నట్టు మా సూతులవారు సంజ్ఞచేసి కథ ప్రారంభించాడు.

❀ ❀ ❀ ❀ ❀

ఆరోజుల్లో మా బంధువులు కొందరు మద్రాసులో పిక్చరొకటి తీశారు. నాలాగే వాళ్లక్కూడా సినిమాలను గురించి ఏమీ తెలీదు. అందుచేత నేను వాళ్ళకి కాస్త ఆసరాగా ఉంటానని నన్నుకూడా రమ్మన్నారు. నేను మాత్రం చేసే పెద్దపనేమీ లేకపోవటంచేత వాళ్ల వెంటవెళ్లాను. నేను రావటం వల్ల వాళ్ళకు నష్టమేమీ కలగలేదు. సినిమా గొడవ తెలీనివాణ్ణి నేను కూడా ఉండటం వాళ్లకి కొంతలోకొంత ధైర్యంగా వుండేది. లాడ్జిలో మంచి వేపుడు కూరలు చేయించటానికి, అప్పుడప్పుడూ పెసరట్లతో పాటు అల్లప్పచ్చడి వేయించటానికీ, అప్పటికప్పుడు బానలో ఆవకాయ వేయించటానికీ నేను బాగా సహకరించాననే చెప్పగలను.

మా పిక్చరేమయిందంటారా? అది వేరే కథ. నేను చెప్పదలచిన కథ అదికాదు.

మా పిక్చరు తీసే స్టూడియోలో మాకు మంచి ఆదరం ఉండేది. కారణం ఆ స్టూడియోలో తీస్తున్న పిక్చరు ఆ రోజుల్లో ఇది ఒకటే. అసలే డిప్రెషన్, అందులో అది పెద్ద ప్రసిద్ధిగల స్టూడియో కాదు. స్టూడియోవాళ్ళు మమ్మల్ని బాగా చూసే వారని చెప్పాను గదూ? మా లాడ్జి స్టూడియోకు చాల దగ్గరగా కూడా ఉండేది. అందుచేత మాకు షూటింగున్నా లేకపోయినా స్టూడియోకు వెళ్ళి కాలక్షేపం చేస్తుండేవాణ్ణి. ముఖ్యంగా కామెరామెన్ శ్రీనివాసన్, సౌండ్ రికార్డిస్టు రాఘవన్ కూడా నాతో వచ్చీరాని తెలుగులో ఆప్యాయంగా మాట్లాడేవాళ్లు.

ఇట్లాగే ఒకరోజు నేను స్టూడియోలో ఉండగా ఒక పరమడొక్కు కారులో ఒక పెద్దమనిషి దిగాడు. ఆయన నడివయస్సువాడు. ఆయన మాట్లాడుతున్నా, నడుస్తున్నా, ఊరికే నిలబడి ముక్కుతుడుచుకుంటున్నా కూడా ఎంతో తొందరమీద ఉన్నట్టుగా కనపడేవాడు. ఆయన వెంట ఒక యువకుడు కూడా ఉన్నాడు, చొక్కామీద పొంటు వేసుకొని. ఆ యువకుడి చంకలో పెద్ద ఫైల్ వుంది.

"నాపేరు చిదంబరం. మీ స్టూడియో మేనేజరెవరు?" అడిగాడా మధ్యవయస్కుడు శ్రీనివాసన్‌ను.

“చెప్పండి, మేమంతా మేనేజర్లమే” అన్నాడు శ్రీనివాసన్.

ఇందులో అబద్ధం ఏమీలేదు. ఆ స్టూడియోకు అయిదుగురు భాగస్వాములు. అయిదుగురూ అయిదు డిపార్టుమెంట్ల పనిచేసేవారు. ఇక మేనేజరంటూ ఉండినవాడు కేవలం గుమస్తా లెక్కలూ అవీ చూసేవాడు.

“నేను పిక్చరు తీస్తాను. నాకు పని తొందరగా జరగాలి. మీ స్టూడియోలో ఎక్కువ పని లేదని తెలిసింది. పోనీ మీ స్టూడియోలోనే తీస్తామని యోచించాను. ఇదుగో, ఈ పిల్లకాయ నా స్క్రిప్టురైటర్. నేనే ప్రొడ్యూస్ చేసి డైరెక్టు చేసుకుంటాను” అన్నాడు చిదంబరం.

“చాలా మంచిది” అన్నాడు శ్రీనివాసన్ తమిళ భాషలో.

“ముందు ఒక రీల్ టెస్టుతీస్తాం. దాన్ని నా భాగస్వాములుచూసి ఆమోదించిన తరవాత స్టూడియో ఎగ్రిమెంట్ చేస్తాం” అన్నాడు చిదంబరం.

“ఈ టెస్టు ఎప్పుడు తీస్తావు. ఎవరితో తీస్తావు” అని శ్రీనివాసన్ అడిగాడు. ఆ సాయంకాలమే తన ఆర్టిస్టును తెస్తాననీ, ఏదో ఉన్న సెట్టుమీదనే నాలుగైదు షాట్లు తీస్తాననీ చిదంబరం అన్నాడు. సాయంకాలం వచ్చేటప్పుడు ఒక రీల్ నెగెటివ్, సౌండూ తెస్తానన్నాడు. మాకోసం వేసిన సెట్టొకటి వుంటే చూపించారు.

“నాది సోషల్ పిక్చర్. ఇది చూస్తే పురాణిక్ పిక్చర్ సెట్టల్లే వుంది. అయినా ఫరవాలేదు. ఈ వాకిలికి కర్టెన్లు తగిలించండి. ఈ మూలగా రెండు క్రోటన్ తొట్లు పెట్టండి. ఈ మధ్యగా కొంచెం డ్రాయింగ్ రూమ్ ఫర్నిచర్ అరేంజ్ చెయ్యండి. పని అయిపోతుంది” అని హెచ్చరించి చిదంబరం యువకుడితో సహా నిష్క్రమించాడు.

మామూలుగా సాయంత్రం ఆరుకల్లా పని మానెయ్యటం స్టూడియోకు అలవాటు. కాని ఈ రోజు కొత్తబేరం తగులుతుందన్న ఆశతో అందరూ చిదంబరం కోసం కనిపెట్టుకుని వున్నారు. సుమారు ఏడుగంటలకు మళ్లీ కారు వచ్చింది. కారులోనుంచి చిదంబరం వెంట కుర్రాడుగాక మరో ఆడమనిషి కూడా దిగింది. సన్నగా యెండుకు పోయివుంది. కాని మనిషి తెల్లని తెలుపు. ఏ పిక్చర్లోనూ నటించిన మనిషికాదు. సరికొత్త సరుకు.

“నా పిక్చర్లో పెద్ద మేకప్ ఏమీలేదు. మామూలు పాన్‌కేక్ వేస్తే చాలు. డ్రెస్సులు కూడా మార్చక్కర్లేదు” అన్నాడు చిదంబరం.

సెట్టుమీదికి వెళ్ళారు. సెట్టేమో చిదంబరానికి కావలసినట్టు సిద్ధంగా వుంది.

“ఎంతసేపూ? గంటలో అయిపోతుంది” అన్నాడు చిదంబరం, చేతిలో వున్న గోల్డ్ ఫ్లేక్ టిన్నులోనుంచి సెట్టుమీద వున్న వాళ్లందరికీ తలా ఒక సిగరెట్టూ ఇస్తూ.

ముందు ఆమెను కుర్చీలో కూర్చోబెట్టి క్లోజప్ తీయించాడు. క్లోజప్‌లో అనేక రకాల భావాలు ఆమెచేత అభినయం చేయించాడు.

"ఒక చిన్న డయలాగ్ టాకీ షాట్ తీస్తాం" అన్నాడు చిదంబరం రెండో విడత సిగరెట్లు పంచుతూ. టాకీ షాట్ తీశారు.

తరవాత ఆమె కుర్చీలో నుంచి లేచి వాకిలి దగ్గరికి వెళ్లటం మిడ్‌షాట్ పానింగ్‌తో సహా తీయించి మళ్లీ సిగిరెట్లు పంచాడు. ఎందుకైనా మంచిదని వాకిలి గుండా గదిలోకి ఆమె రావటం మరొక షాట్, లాంగ్‌షాట్ తీయించాడు.

అప్పటికి అయిదువందల అడుగులు అయిపోయింది. మరి రెండు టాకీషాట్స్ తీసి టెస్టు ముగిస్తామన్నాడు. కుర్రవాడు పుస్తకంలో నుంచి పది పదిహేను వాక్యాలు విడిగా రాసి ఆర్టిస్టు చేతికిచ్చాడు. వాటిని ఆమె అదివరకే కంఠస్తం చేసిఉండాలి. రెండుసార్లు మోనిటరిచ్చి టేక్‌కు సిద్ధమయింది. రాత్రి పదిన్నరకు ఆ టేక్ కూడా అయిపోయింది.

"ఇంకా రెండు వందల అడుగుల నెగిటివ్ ఉంది" అన్నాడు శ్రీనివాసన్.

"కామెరాలో ఉండనివ్వండి. రేపు ఒకటి రెండు ఔట్‌డోర్ షాట్స్ కూడా తీసి నా భాగస్తులకు చూపుతాను. వాళ్లకు మీ స్టూడియో పని గురించి ఐడియా వుంటుంది" అన్నాడు చిదంబరం.

మరునాడు స్టూడియో కాంపౌండులోనే మూడు షాట్లు తీశారు. ఆ ఆర్టిస్టే, అదే రోజారంగు చీరె, ఆ చీరెకు స్టూడియో వాళ్ళు "కంటిన్యుయిటీ" అని నామకరణం చేశారు. మూడూ టాకీ షాట్లే తీశారు.

"ఈ రీల్ త్వరలో డెవలప్ చేసి చక్కగా ప్రింట్‌చేసి ఇవ్వండి" అన్నాడు చిదంబరం.

చిదంబరం టెస్ట్ అని పేరుపెట్టి తన పిక్చర్లో ఏ పాతిక షాట్లో తీసేశాడనీ, ప్రస్తుతం అతని దగ్గర ఈ ఆర్టిస్టు తప్ప మరెవ్వరూలేరనీ, భాగస్వాములు కూడా లేరనీ, ఈ రీల్ చూపించి భాగస్వాములను సంపాదించి, డబ్బు తీసుకొని, స్టూడియోకు కొంత అడ్వాన్సిచ్చి, మిగిలిన ఆర్టిస్టులను బుక్ చేసి తతంగం నడిపిస్తాడని స్టూడియోలో పుకారు పుట్టింది.

ప్రింటు పట్టుకు పోయిన వారం రోజులకు చిదంబరం తిరిగి వచ్చాడు స్టూడియోకు. వెయ్యిరూపాయలు అడ్వాన్సిచ్చాడు. మర్నాడు సెట్టు వెయ్యమన్నాడు. అతను తాను తీసిన షాట్లు పదిమందికి చూపి తలా ఒక వెయ్యా అడ్వాన్సు తెచ్చాడన్నారు. చిదంబరమే ప్రొడ్యూసరు, అతనే దర్శకుడునూ. కుర్రవాడు కవీ, అసిస్టెంటూనూ. ఆ ఆడమనిషి హీరోయిన్.

కొత్త సెట్టు మీద పనిచెయ్యటానికి మరి ముగ్గురు నటులు వచ్చారు. అందులో ఒకడు హీరో, ముగ్గురూ సినిమాకు కొత్తవాళ్లేగాని స్టేజి అనుభవం గలవాళ్లు.

మా షూటింగు మాట ఏమైనా చిదంబరం షూటింగు మహా జోరుగా సాగింది. నెల పూర్తి అయ్యే లోపల పిక్చరు పూర్తి అవుతుందనీ, స్టూడియో బిల్లు చెల్లించే లోపల పిక్చరు విడుదల అవుతుందనీ పుకారు పుట్టింది.

చిదంబరం ఉద్దండుడు. ఒకషాట్ అయిపోయి రెండో షాట్‌కు లైట్లు అరేంజ్ చేసే లోపుగా అందరికీ సిగిరెట్లు అందించి, "ఎంతసేపూ పనేనా? పొగ ఆనందించండి. ఈ పాటి ఆనందమైనా లేకపోతే జీవితం దేనికి? అదే నా పిక్చర్‌లో సందేశం" అనేవాడు. ఇంకోవంక తన ఆర్టిస్టులను తెగ అదిలించి "కమాన్, కమాన్, ఇన్ని రిహార్సల్సా? ఇక్కడి టెక్నీషియన్లు మనని చూసి నవ్వరూ?" అనేవాడు.

షూటింగు ప్రారంభమైన మూడు వారాలలోగా పదిహేడు పద్దెనిమిది రీల్స్ నెగిటివ్ షూట్ చేశాడు. ఎడిట్ చేస్తే పన్నెండు, పదమూడు రీల్స్ అవుతుందన్నారు. చూస్తున్న వాళ్లకి కథ అయోమయంగా వున్నా షాట్లలో "ఎన్, జీ"లు లేవు. అయిదారు పాటలున్నాయి. ఆ పాటలు అయిపోయేసరికి పిక్చరు కూడా అయిపోతుందని పుకారు పుట్టింది.

హీరో వేస్తున్నవాడికి స్నేహితులు సలహా ఇచ్చారు. డబ్బు విషయం జాగర్త పడమని– తనకు ఎడ్వాన్సుకూడా ఏమీ ముట్టలేదని హీరో చల్లగా బయటపెట్టాడు. అతనికి కంగారు పుట్టింది. చిదంబరం దగ్గరికి పోయి, "నాజీతం ఎంత? ఎప్పుడిస్తావు?" అని అడిగాడు.

"ఏం జీతం?" అన్నాడు చిదంబరం

"నేనీ పిక్చర్లో నటిస్తున్నందుకు జీతం లేదా?" అన్నాడు హీరో.

"ఉంటే నెలాఖరుకు వస్తుంది" అన్నాడు చిదంబరం.

"నాకు కొంత అడ్వాన్సు కావాలి!" అన్నాడు హీరో.

"ఎందుకు?" అన్నాడు చిదంబరం. "నీ ఖర్చులన్నీ నేనిచ్చుకుంటున్నానే?"

"ఇంటికి పంపాలి" అన్నాడు హీరో.

"నేను ఇంటి దగ్గరనుంచి తవ్వితెచ్చి ఈ పిక్చరు కోసం ధారపోస్తుంటే నాతో సహకరించకపోగా ఇంటికి పంపటానికి డబ్బు కావాలంటావా? నీకెవడు హీరో ఛాన్సిస్తాడు? ఇట్లాగేనా నువు నాకు కృతజ్ఞత చూపేది?"

చిదంబరం వాలకం చూస్తున్నకొద్దీ హీరోకు అనుమానం హెచ్చసాగింది. వాడు బ్రహ్మాస్త్రం వేశాడు. "నాకు రెండు వందలిస్తేగాని నేను మేకప్ వెయ్యను" అన్నాడు.

బ్రహ్మాస్త్రం కాస్తా గడ్డిపోచ అయిపోయింది.

"నువు వేషం వెయ్యనక్కరలేదు. నీ వేషం అయిపోయింది. నువు పోవచ్చు. ఇక నీకు లాడ్జిలో భోజనం కూడా లేదు. నీకు తిరుగు రైలు ఖర్చులుకూడా ఇవ్వను. నువు నామీద తిరుగుబాటు చేసినట్టు ఇంతమంది సాక్ష్యం వుంది. నీకేమైనా రావలిసివుంటే కోర్టుకు పోయి రాబట్టుకో!" అన్నాడు చిదంబరం.

హీరో తెల్లబోయినాడు. వాడికి జన్మలో మొదటిసారిగా దైవభీతి వంటిది ఒక భావం కలిగింది. స్టూడియోలో వాళ్ల దగ్గర పదిరూపాయలు ముష్టెత్తి వాడు స్వగ్రామం వెళ్లిపోయాడు.

త్వరలోనే చిదంబరం చిత్రం పూర్తి చేశాడు. రహస్యంగా డిస్ట్రిబ్యూటర్లను మాట్లాడాడు. పన్నెండువేలు అడ్వాన్స్ పుచ్చుకున్నాడు. బాక్‌గ్రౌండ్ సంగీతంతో సహా, బాక్ గ్రౌండ్ పాటలతో సహా ఫలానితేదీకి పదికాపీలు రిలీజిస్తానన్నాడు. అన్న తేదీకి కాపీలు వెళ్లాయి. కాని వాటికి బాక్‌గ్రౌండ్ మ్యూజిక్ లేదు. ఆ చిత్రాన్ని అట్లాగే రిలీజు చేశారు. అది రిలీజయిన మూడో రోజుకే ఇంజక్షన్ ఆర్డరు వచ్చి ఎక్కడి కాపీలక్కడ నిలిపివేశారు. కారణం అడ్వాన్సు పదివేలూ తీసుకుని చిదంబరం ఎటో వెళ్లిపోయాడు. అతనికి పదివేలిచ్చిన భాగస్వాములకు డిస్ట్రిబ్యూషన్ గొడవే తెలీదు. అసలింకో రెండు మూడు నెల్లకి గాని పిక్చరు పూర్తికాదని వాళ్లనుకుంటున్నారు. పత్రికలో ప్రకటనలు చూసి వాళ్లు మేలుకున్నారు.

కానీ ఏం లాభం, పిక్చరు పట్టి తుక్కు. వాళ్ల డబ్బు వాళ్లు మళ్ళీ కళ్ల చూడలేదు. చిదంబరం రంగూను వెళ్లిపోయినాడన్నారు. అతన్ని గురించి నేను మళ్ళీ వినలేదు.

*మొదటి ముద్రణ : కినిమా మాసపత్రిక, ఆగస్ట్1953*